మహిళా శక్తి ఎంతో గొప్పది



మహిళా దినోత్సవంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అన్నపురెడ్డి స్వర్ణలతభీమార్జున్‌రెడ్డి

బండ్లగూడ: సమాజ నిర్మాణంలో మహిళా శక్తి ఎంతో గొప్పదని చేవెళ్ల మాజీ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలో అన్నపురెడ్డి స్వర్ణలతాభీమార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తి లేకపోతే సమాజం లేదన్నారు. సమాజాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత మహిళలు తీసుకొని ముందుకు సాగుతున్నారన్నారు. అలాంటి మహిళలను గౌరవించడంతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న కాలనీవాసులు

మైలార్‌దేవ్‌పల్లి: ఓ నిరుపేద కుటుంబానికి కాలనీవాసులు రూ.54,500లను ఆర్థిక సాయం అందజేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో నివసిస్తున్న నాగేశ్వర్‌రావు అనారోగ్యంతో కొన్ని నెలల క్రితం చనిపోయాడు. ఇప్పుడు వారి భార్య అనారోగ్యంతో దవాఖానాల చుట్టూ తిరిగి చివరకు కన్ను మూశారు. పేద కుటుంబం కావడంతో అంత్యక్రియలకు కూడా డబ్బు లేకపోవడంతో కాలనీవాసులు పెద్ద మనస్సు చేసుకొని ఆ కుటుంబానికి మేమున్నామని ముందుకు వచ్చి వారి కుమారుడు లేబర్ పని చేస్తున్న మణికంఠకు శనివారం తన నివాసానికి వెళ్లి ఆర్థిక సహాయం అదంజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షుడు డీవీ కుమార్, కార్యదర్శి విజయ్‌కుమార్, ఆంజనేయులు మేస్త్రీ, ప్రశాంత్‌గౌడ్, నాని, కిషోర్, రామకృష్ణ, వెంకటేష్ ఉన్నారు.

ఆలయానికి డస్ట్‌బిన్‌ల వితరణ



డస్ట్‌బిన్‌లను అందజేస్తున్న వాసవీక్లబ్ నాయకులు

మణికొండ: సంకట హరహనుమాన్ ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచే క్రమంలో వాసవీ క్లబ్ ఫ్యామిలీ వారు డస్ట్‌బిన్‌లను అందజేశారు. శుక్రవారం రాత్రి రూ.20 వేల విలువైన డస్ట్ బిన్‌లను అందించినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నారాయణస్వామి, జోన్ చైర్మన్ జగన్మోహన్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణస్వామి, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రావు, అశోక్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్మెంటరీ స్టోర్‌లో నటి తేజస్వి సందడి



స్టోర్ ప్రారంభోత్సవంలో నటి తేజస్వి మదివాడ

గచ్చిబౌలి: కొత్తగూడలోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో ఎల్మెంటరీ కిచెన్ వేర్ స్టోర్‌ను శనివారం నటి తేజస్వి మదివాడ ప్రారంభించి సందడి చేశారు. ఇంటీరియర్స్‌కు ప్రసిద్ధి చెందిన లైఫ్ స్టైల్ బ్రాండ్‌కు చెందిన ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి. సెరామిక్, గ్లాస్, వుడ్, మెటల్, మార్బుల్, టెర్రకోట, తదితర వస్తువులతో పాటు డైనింగ్ డెకర్, టేబుల్ డెకర్, కిచెన్ డెకర్ స్టోర్‌లో కొలువుదీరాయి.

భక్తిశ్రద్ధలతో జాగరణ



జాగరణలో దాండియా ఆడుతున్న మహిళలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘం ప్రాంతంలోని ఈదమ్మ ఆలయం వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన జాగరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీజేఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు. శివనామస్మరణతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. భక్తి గీతాలకు అనుగుణంగా భక్తులు బతుకమ్మ, కోలాటం ఆడుతూ జాగరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రతి కాలనీ, బస్తీలను అన్ని రంగాల్లో అభివృద్ధే చేయడమే తన లక్ష్యమని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లితండాలో స్థానికులతో కలిసి సీసీరోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పనులు చేపట్టి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతునాయక్, శ్రీనివాస్, శేఖర్, నర్సింగ్‌నాయక్, ప్రభాకర్, ప్రకాశ్, వేణు, కృష్ణ, మహేశ్‌నాయక్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, స్థానికులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

బెల్టు తీస్తలేరు!

ఎక్కడపడితే అక్కడ బెల్టుదుకాణాలు
- చాయ్ హోటళ్లు.. కిరాణా దుకాణాల్లో విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు, పోలీసులు

శంషాబాద్: బెల్టుదుకాణాలను కచ్చితంగా తొలగిస్తామని రాష్ట్ర సర్కారు పలుమార్లు పలు వేదికలపై ప్రకటించిన సంగతి తెలిసిందే..మూడు నెలలు కావస్తున్నా ఎక్సైజ్, పోలీసులు మాత్రం మద్యం విక్రయాలు జరుపుతున్న బెల్టు దుకాణాల తొలగింపు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టు దుకాణాలు 24 గంటల పాటు మందుబాబులకు సేవలందిస్తున్నాయి. బెల్టు దుకాణాల కారణంగా జరుగుతున్న పర్యవసానాలను మాత్రం గాలికొదిలేసినట్టే కనిపిస్తోంది. చాయ్ హోటళ్లే బార్లుగా..శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శంషాబాద్ పట్టణంతో పాటు గ్రామాల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని రాజేంద్రనగర్ సర్కిల్‌లోని గగన్ పహాడ్, ఆయా బస్తీల్లో, పారిశ్రామికవాడల్లో ఛాయ్ హోటళ్లు కాస్తా ఓపెన్ బార్లుగా మారుతున్నాయి. అక్రమంగా మద్యం విక్రయించడమే కాకుండా మందుబాబులకు అక్కడే సిట్టింగ్ సేవలను సైతం అందిస్తున్నారు. ఉదయం 6 గంటలకే మందుబాబులు బెల్టుదుకాణాల తలుపులు తడుతున్నారు. వైన్ షాపులు మూసిన అనంతరం కూడా అక్రమ దుకాణల్లో మాత్రం అంతకు మించిన సమయం వరకు విక్రయాలు కొనసాగుతున్నాయి.



గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలోని హోటల్‌లో..

అనేక ఇబ్బందులు..

చాలాచోట్ల కాలనీలు, బస్తీల్లో ఉండే ఈ దుకాణాల కారణంగా చుట్టుపక్కల ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఘర్షణలు చోటు చేసుకుంటన్న సందర్భాలు కూడా తరచూ చోటు చేసుకుంటున్నాయి. స్థానికంగానే మద్యం విక్రయాలు ఉండడంతో వ్యసనపరులు పగలు, రాత్రి తేడా లేకుండా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అక్రమ దుకాణాల తీరును నిత్యం గస్తీ కాసే పోలీసులతో పాటు ఎక్సైజ్ అధికారులకు పక్కాగా తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ప్రకటించినట్లు మద్యం బెల్టుదుకాణాలు మూసేందుకు అధికారులు బెల్టు తీస్తారా.. లేదా..? అన్న చర్చ కొనసాగుతోంది.

భారీ చెట్టును నరికివేస్తున్నారంటూ ఫిర్యాదు

రాజేంద్రనగర్: బుద్వేల్ నుంచి కిష్టమ్మ గుట్టకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న భారీ చెట్టును తొలగిస్తుండటంతో స్థానికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన అటవీ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని చెట్టును తొలగిస్తున్న వారిని అడ్డుకొని సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బుద్వేల్ నుంచి కిష్టమ్మ గుట్టకు వెళ్లే రహదారి పక్కనే భారీ చెట్లు ఉన్నాయి. ఇందులోని ఓ చెట్టును పక్కనే ఉన్న ఇంటి యజమాని ప్రైవేటు వ్యక్తులతో శనివారం ఉదయం నరికివేయిస్తున్నాడు. రోడ్డును మూసివేసి ఈ పనులను చేపట్టాడు. ఈ విషయాన్ని స్థానికులు మీడియా సిబ్బందితో పాటు అటవీ శాఖ రేంజ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో రేంజ్ అధికారి హరి ఆధ్వర్యంలో ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కొంత మేర చెట్టును నరికివేశారు. నరికివేత పనులను ఆపివేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి హరి మాట్లా డుతూ.. చెట్లను నరికివేస్తే అటవీ చట్టం ద్వారా కేసులను నమోదు చేస్తామన్నారు.



చెట్టును నరికివేసిన దృశ్యం

నేడు ఆస్తిపన్ను పరిష్కార వేదిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, అత్తాపూర్ డివిజన్ల ప్రజలు ఈ పరిష్కార వేదికకు హాజరై పరిష్కార వేదికలో ఆస్తిపన్నుకు సంబంధించిన వివాదాలను, హెచ్చు తగ్గులను పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పరిష్కార వేదిక కొనసాగుతుందన్నారు. సర్కిల్ కార్యాలయంలోని ఉప కమిషనర్ చాంబర్‌లో ఈ పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మహాత్మా సావిత్రీబాయి పూలే వర్ధంతి

రాజేంద్రనగర్: ఈనెల 10న రాజేంద్రనగర్ జూనియర్ కాలేజీ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మహాత్మా సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జ్యోతిబా పూలే కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా యావత్ బీసీ సమాజం భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ భగవత్‌గూడలో ఈనెల 10న శ్రీ భవానీ శివసాయి ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కామినేని ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో గుండె, జనరల్ సంబంధిత పరీక్షలతో పాటు బీపీ, ఆర్‌బీస్, ఈసీజీ, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారీ కేంద్రంపై దాడి

మైలార్‌దేవ్‌పల్లి: కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును తయారు చేస్తున్న కంపెనీపై ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసుల వివరాల ప్రకారం.. పారిశ్రామిక వాడలో అనేక కల్తీ తయారు కంపెనీలు వెలుస్తున్నాయి. శనివారం ఓ గోదాంలో రోషన్ జింజెర్, గార్లిక్ పేస్టు అనే బ్రాండ్‌తో టాటానగర్ సుబాన్ కాలనీలో మహమ్మద్ అంజద్ కొన్ని రోజులుగా కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. 500 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకొని పరిశ్రమను నిర్వహిస్తున్న వ్యక్తిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ మధు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పరిశ్రమలో దొరికిన కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు

'పసుపులేటి' జీవితం ఆదర్శం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ వీరయ్య

గచ్చిబౌలి: సామాజిక అసమానతలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన పసుపులేటి వెంకటేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ వీరయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ట్రేడ్ యూనియన్ నాయకుడు వెంకటేశ్వరరావు 90వ జయంతి సందర్భంగా 'మహిళా చైతన్యంపై మాట్లాడుదాం రండి' అనే పేరిట రాసిన పుస్తకాన్ని ఏఐకేఎస్ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో సీఐటీయూ యూనియన్ ఏర్పాటులో ఆయన కృషి మరువలేనిదన్నారు. మహిళల హక్కుల కోసం పురుషులను చైతన్యం చేయడం మన ముందున్న ప్రధాన కర్తవ్యమన్నారు. మల్లారెడ్డి, మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంతోనే మహిళల భాగస్వామ్యం వచ్చిందన్నారు. అనంతరం వెంకటేశ్వరావు కుటుంబసభ్యులు నేత్ర, అవయవ, శరీరదాన అంగీకార పత్రాలను సంబంధికులు అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు జానిలా, సుశీల, అశోక్‌కుమార్, అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డిజి నర్సింహ్మారావు, జ్యోతి, యూటీఎఫ్, ఏఐడీడబ్ల్యూ, సీపీఎం, ఎన్‌పిఆర్‌డిలకు చెందిన నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్‌పై దృష్టి పెట్టాలి

శేరిలింగంపల్లి: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్‌పై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి బాపూనగర్‌లోని ఇమ్మాయిస్ ది స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, హనుమాన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గోపాల్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

శేరిలింగంపల్లి: సురభీకాలనీలో చైల్డ్ ఫండ్ అండ్ సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సురభీకాలనీ యూత్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. హోలిస్టిక్ ఆసుపత్రి కొండాపూర్ సౌజన్యంతో బీపీ, షుగర్, ఈసీజీ, కంటితో పాటు ఇతర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజిషియన్ డాక్టర్ తారక్‌రామ్ మాట్లాడుతూ ఏ చిన్నా అనారోగ్య సమస్య ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వ్యాయామం, యోగా, నడక వంటివి చేస్తే రోగాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో చైల్డ్ అండ్ సీడబ్ల్యూసీ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీశైలం, కోఆర్డినేటర్ దివ్య, ఇతర ప్రతినిధులు మమత, షబానా, నిర్మల, డాక్టర్లు, పీఆర్‌ఓ నాగరాజు, పోతవేణి, నర్సింగ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ డివిజన్‌లోని ఖాదర్‌బాగ్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాదర్‌బాగ్‌లో అన్ని రోడ్లు, గల్లీలలో వీడీసీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. రోడ్లు వేయకముందే డ్రైనేజీ పనులు కూడా చేపట్టామని తెలిపారు. స్థానిక మజ్లిస్ నాయకుడు షబ్బీర్ అలీఖాన్, స్థానికులు డ్రైనేజీ, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో వాటిని కూడా పరిష్కరించామన్నారు. యువకులు ఐక్యంగా బస్తీ అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. రంజాన్ మాసంలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నిన్నటి తరం నారీమణులకు నీరాజనం

మణికొండ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చరిత్రలో నిలిచిపోయిన నిన్నటితరం మహిళా ప్రతిభా మూర్తులకు పలువురు నిరాజనం పలికారు. మణికొండ మున్సిపాలిటీ, డాలర్స్ హిల్స్‌లోని డాక్టర్ సి.నారాయణరెడ్డి(సినారె) నివాసం విశ్వంభరలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు ప్రముఖ మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుశీలా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా కర్ణాటక సంగీత విద్వాంసురాలు, నర్తకి బెంగళూరు నాగరత్నమ్మ, హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు నైనా దేవిల గురించి ప్రసంగించారు. నాగరత్నమ్మ దేవదాసి వర్గంలో జన్మించినా పట్టుదలతో సంగీత నృత్యాల్లో ప్రావీణ్యం, సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళం వంటి భాషల్లో పాండిత్యం సాధించి గొప్ప విదుషీమణిగా పేరుపొందటంతో పాటు అనేక ధర్మ కార్యాలు చేసిందన్నారు. భూమిక సంపాదకురాలు, రచయిత్రి కొండవీటి సత్యవతి, కొండపల్లి కోటేశ్వరమ్మ ఉద్యమ చరిత్ర, రచయిత్రిగా ఆమె పడిన కష్టాలను వివరించారు. ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి తన భర్త శివరాజుకు దీటుగా కథలు, చిత్రలేఖనాలు చేశారన్నారు. సామాజికంగా ఎటువంటి ప్రోత్సాహం లేని ఆ కాలంలో ఇలాంటి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదిగి నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ప్రముఖ నర్తకి, నాట్య గురువా డాక్టర్ యశోదా ఠాకూర్ దేవదాసీ నాట్యశైలిని, ఆలయ ఆస్థాన నృత్యకళ గురించి, అన్నాబత్తుల బులి వెంకటరత్నం అనే నృత్యకారిణి జావళిని అభినయపూర్వకంగా యశోద ప్రదర్శించి అభినందనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగ, మహిళలు, రచయిత్రిలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుశీలా నారాయణరెడ్డి

భక్తిశ్రద్ధలతో వీరభద్రస్వామికి రుద్రాభిషేకం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని మచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు శనివారం వీరభద్రస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వంశపారంపర్య ధర్మకర్తలు కోరారు. శనివారం జరిగిన అభిషేకంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ ముంగి జ్యోతి జైపాల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

కొనసాగిన జాగరణ..

మహా శివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే జాగరణలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి మణికొండ, పుప్పాలగూడ, మంచిరేవుల గ్రామాలలోని శివాలయాల్లో కల్యాణాలు, జాగరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భజనలు, శివపంచాక్షరిలు పఠిస్తూ రాత్రంగా జాగరణ చేశారు.



మంచిరేవుల రుద్రాభిషేకంలో పాల్గొన్న జైపాల్‌రెడ్డి దంపతులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

అత్తాపూర్: అత్తాపూర్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవం, పూజా కార్యక్రమాలకు స్థానిక ప్రాంతాలకు చెందిన అశేష ప్రజానీకం మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి ఆంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆకట్టుకున్న భరతనాట్యం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో తిల్లాన ఆర్ట్స్ గురువు మాధవి మారేళ్లపూడి శిష్యబృందం శనివారం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నది. మల్లారి, జయ జయ స్వామిన్, వసంత రూపకం, నటేశకౌతం, రారవేను, ఇంద్ర రేఖ, తిల్లాన అంశాలను కళాకారులు గంగ, వృందా, సాయిసన్నిధి, అవిజ్ఞ, చేతన, శామృద్ధి, స్మృతి, ఇషితా, అన్వి తదితరులు ప్రదర్శించారు.



కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

అన్నమయ్యపురంలో నృత్యార్చన ..

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా అక్షద డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ గురువు నిహాంత్రిరెడ్డి శిష్యబృందం శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా కళాకారులు జ్ఞాశ్రీత, సిత్ర, గృహిత, ధృవిక, ఆద్వి, సుశ్రీ, హని, సౌమ్య, హర్షవి, త్రిష, రచన, లత, నియతి, నిహారిక, నక్షత్ర, ముక్త, యమున, భమి, నిహ్రాంతి, మౌక్తిక, ధన్యతలు వినాయకకౌతం, స్వాగతం కృష్ణ, పార్వతీ వల్లభాష్టకం, నాగేంద్ర హరాయ, దేవదేవం, స్వాగతం కృష్ణ, పార్వతీ వల్లభాష్టకం తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

